
ఇష్టమొచ్చినట్లు తినేస్తే కుదరదు..

- ఫాస్ట్‌ఫుడ్స్‌తో అనారోగ్యం...
- చిన్నవయస్సులోనే గ్యాస్ట్రబుల్ సమస్యలు
- జంక్‌ఫుడ్స్‌తో పొంచిఉన్న జబ్బులు

'గుంటూరు అరండల్‌పేటకు చెందిన శ్రీదేవి ఇంటర్ చదువుతోంది. కొంతకాలంగా కళాశాల క్యాంటీన్‌లో ఫాస్ట్‌ఫుడ్స్ తింటూ ఇంటి భోజనం పక్కన పడేసింది. ఇటీవల కాలంలో రక్తపు విరోచనాలు అయ్యాయి. చికిత్స కోసం జీజీహెచ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులను సంప్రదించారు. వైద్యులు పరీక్షలు చేసి ఫాస్ట్‌ఫుడ్స్ ఎక్కువగా తీసుకోవడం కారణంగా నిర్ధారించి చికిత్స అందించారు' ఇలాంటి కేసులు భారీగా పెరిగిపోతున్నాయి.





గుంటూరు మెడికల్: ప్రస్తుతం ఆహారం తీసుకునే దగ్గర నుంచి ఎంపిక వరకు మార్పులు కనిపిస్తున్నాయి. పిల్లలకు చిరుతిళ్లపై ఉన్న ఇష్టం మాటల్లో చెప్పలేనిది. స్కూల్‌కు వెళ్లాలంటే ఏదో ఒకటి కొనిపిస్తే తప్పా బడికి వెళ్లమని మారం చేస్తారు. ఇంటర్‌వెల్ సమయంలో తప్పనిసరిగా చిరుతిళ్లు కొనుక్కునేందుకు డబ్బులు ఇవ్వాల్సిందే. కంప్యూటర్ కాలంలో పిల్లల చిరుతిళ్లు మారిపోయాయి. ఒకప్పుడు చాక్లెట్, బిస్కెట్, వేరుశనగ ఉండలు, జీడీలు, పుల్ల ఐస్‌తోపాటుగా జామ, రేగిపండు లాంటి సీజనల్ పండ్లు పిల్లలను తినేవారు. పాఠశాలల వద్ద పిల్లల తినుబండారాలు అమ్మే దుకాణాల్లో ఇవి అమ్మేవారు. ఇప్పుడు రంగుల రంగుల ప్యాకెట్స్‌లో జంక్ ఫుడ్స్‌ను దండలుగా వేలాడదీసి పిల్లలను ఆకర్షించేలా షాపుల వద్ద పెడుతున్నారు. రంగుల ప్యాకెట్లతో తియ్యటి విషం ఉంటుందని, వాటిని తింటే రోగాలు వస్తాయని తెలియక చిన్నారులు వాటిని తిని వ్యాధుల బారిన పడుతున్నారు. తల్లిదండ్రులు పిల్లల తిండి విషయంలో ఓకింత శ్రద్ధ చూపించనిపక్షంలో తీవ్ర అనారోగ్యం పాలయ్యే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

జిల్లాలో వెయ్యి పైగా షాపులు...

జిల్లాలో చిరుతిళ్లు విక్రయాలు చేసే దుకాణాలు వెయ్యిపైగా ఉన్నాయి. తయారీ దుకాణాలు వంద వరకు ఉన్నాయి. కేవలం ఒక్క గుంటూరు నగరంలోనే 40 హోల్‌సేల్ షాపులు ఉండగా రిటైల్‌షాపులు వందకు ఉన్నాయి. వీటిల్లో ఫుడ్‌సేఫ్టీ కంట్రోల్ అధికారుల వద్ద అనుమతులు తీసుకుని నిబంధనల ప్రకారం విక్రయాలు చేసేవారి సంఖ్య 100 కు మించి ఉండదు. కొందరు వ్యాపారులు అధిక లాభాల కోసం నాసిరకం బియ్యం, గోధుమ, మైదా, శనగపిండి, పామాయిల్‌తో ఇళ్లలోనే చిరుతిళ్లు తయారు చేస్తూ నిబంధనలకు తిలోదకాలు ఇస్తున్నారు. ఇలాంటి ఆహారం తినడం ద్వారా పిల్లలు చిన్న వయస్సులోనే గ్యాస్ సంబంధిత సమస్యలతో వైద్యులను సంప్రదిస్తున్నారు.

చిన్న వయస్సులో వ్యాధులకు కారణాలు

పిల్లలు ఎక్కువగా పిజ్జా, బర్గర్లు, న్యూడిల్స్, కుర్‌కురేలు వంటి ఫాస్ట్‌ఫుడ్స్ తినడం వల్లల పిల్లల శరీరాల్లో చెడు కొలెస్ట్రాల్ పెరిగిపోయి వ్యాధుల బారిన పడుతున్నారు. పాఠశాలల్లో ఇళ్ల వద్ద వారికి వ్యాయామం లేకపోవడం, చదువుల ర్యాంకుల కోసం పిల్లలపై విపరీతమైన ఒత్తిడి చేయడం, పరీక్షలంటే పిల్లల్లో తీవ్ర ఆందోళన ఉండటం వల్ల గ్యాస్ సంబంధిత సమస్యలు పెరుగుతున్నాయి. ఐదేళ్ల నుంచి 17ఏళ్ల మధ్య వారు ఎక్కువగా వ్యాధుల బారిన పడుతున్నారు.

జంక్ ఫుడ్స్‌తో సమస్యలు



జంక్‌ఫుడ్స్ వల్ల పిల్లల్లో అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. ఎక్కువగా జీర్ణకోశ సంబంధిత సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఎక్కువ సార్లు కాచిన వంటనూనెతో పిల్లల చిరుతిళ్లు తయారు చేయటం వలన జీర్ణసంబంధిత సమస్యలు వస్తున్నాయి. బాల్యంలోనే స్థూలకాయం బారిన పడుతున్నారు. ఒక్కసారి తింటే వారానికి సరిపడా ఉప్పు పిల్లల శరీరంలోకి వెళ్లిపోతుంది. చిన్నవయస్సులోనే బీపీ, షుగర్‌లకు కూడా జంక్‌ఫుడ్సే కారణం. రక్తహీనత, పోషకాహారలోపం ఏర్పడతాయి.

– డాక్టర్ షేక్ నాగూర్‌బాషా, గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్, గుంటూరు.

లక్షణాలు

ఫాస్ట్‌ఫుడ్స్ వల్ల వ్యాధుల బారిన పడిన వారిలో తేపులు ఎక్కువగా రావడం, అల్సర్లు ఏర్పడడం, లూజు మోషన్స్, రక్తపు విరోచనాలు వంటి లక్షణాలు ఉంటున్నాయి.

బాధితుల వివరాలు

గుంటూరు జీజీహెచ్‌లో 2022లో 744 మంది, 2023లో 900, 2024లో 1204 మంది ఐదేళ్ల నుంచి 17 ఏళ్లలోపు వారు ఫాస్ట్‌ఫుడ్ తిని వివిధ రకాల అనారోగ్య సమస్యలతో గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్య విభాగంలో చికిత్స పొందారు.

క్లుప్తంగా

జాతీయస్థాయి అబాకస్ పోటీలకు ఎంపిక



గుంటూరు ఎడ్యుకేషన్: చెన్నైలో జనవరి 19న నిర్వహించనున్న జాతీయస్థాయి అబాకస్ పోటీలకు విద్యార్థిని డి.వెంకట విద్యారాణి ఎంపికైనట్లు డాక్టర్ కేఎల్‌పీ పబ్లిక్ స్కూల్ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ తెలిపారు. జేకేసీ కళాశాల రోడ్డులోని కేఎల్‌పీ స్కూలులో సోమవారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ఆదివారం విజయవాడలోని సిద్ధార్థ ఆడిటోరియంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అబాకస్ పరీక్షలో మొదటి రన్నరప్‌గా నిలిచిన విద్యారాణి జాతీయస్థాయికి అర్హత సాధించినట్లు వివరించారు. అబాకస్‌లో శిక్షణ కల్పించడం ద్వారా రాష్ట్ర స్థాయి పరీక్షలో విజేతగా నిలిచిందని తెలిపారు. పాఠశాల ప్రిన్సిపాల్ జి.రత్తయ్య మాట్లాడుతూ చిన్న తరగతుల నుంచే విద్యార్థులందరికీ అబాకస్‌లో శిక్షణ ఇవ్వడం ద్వారా విజేతలుగా నిలుస్తున్నారని అన్నారు. ఈసందర్భంగా పాఠశాల వ్యవస్థాపకుడు డాక్టర్ కె.బసవపున్నయ్య, నాగార్జున ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ఏఓ కె.వెంకట్రావు, ఉపాధ్యాయులు విద్యార్థినిని అభినందించారు.

వాలీబాల్ విజేత షాలోమ్ స్కూల్



గుంటూరు వెస్ట్ (క్రీడలు): గ్లోబల్ స్పోర్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన జూనియర్ వాలీబాల్ పోటీల్లో విజేతగా షాలోమ్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ నిలిచింది. రన్నర్స్‌గా లోటస్ ఆధ్యా నిలిచింది. ఈ సందర్భంగా గ్లోబల్ స్పోర్ట్స్ ఫౌండేషన్ కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ మొత్తం జిల్లా వ్యాప్తంగా 8జట్లు పాల్గొన్నాయన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రధానం చేసారు. కార్యక్రమంలో బి.కృష్ణారావు పాల్గొన్నారు.

అసమానతలు రూపుమాపేందుకు కృషి



గుంటూరు ఎడ్యుకేషన్: సమాజంలో నెలకొన్న అసమానతలను రూపుమాపడంలో ఉపాధ్యాయులు కృషి చేయాలని రాయపాటి రంగారావు విద్యా(ఆర్వీఆర్ బీఈడీ) కళాశాల కరస్పాండెంట్ గద్దె మంగయ్య తెలిపారు. సోమవారం జేకేసీ కళాశాలరోడ్డులోని ఆర్వీఆర్ బీఈడీ కళాశాలలో 2024–26 బీఎడ్ విద్యార్థులకు స్టూడెంట్స్ ఇండక్షన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా మంగయ్య మాట్లాడుతూ విద్య ప్రాముఖ్యత గుర్తెరిగా, సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర గొప్పతనాన్ని తెలుసుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య మోటూరి రవికుమార్ మాట్లాడుతూ బీఎడ్ కోర్సులో చేరిన విద్యార్థులు ప్రాథమిక విద్యాబోధనలో అవలంబించాల్సిన పద్ధతులు, విధి, విధానాలను గురించి వివరించారు. ఈసందర్భంగా విద్యార్థుల సందేహాలు నివృత్తి చేశారు.

బ్యాంకు ఖాతాదారుల సమావేశం

కొరిటెపాడు: ఏలూరి బ్యాంక్ బ్రాడీపేట శాఖ ఖాతదారుల సమవేశం సోమవారం బ్యాంకు ఆవరణలో నిర్వహించారు. సమావేశంలో బ్యాంకు బ్యాంకింగ్ సేవలను ముఖ్య శాఖాధికారి ఎన్.సీతారామాంజనేయులు కొనియాడారు. బ్యాంక్ వ్యాపారం రూ.64 కోట్ల నుంచి రూ.78 కోట్లకు పెరిగిందని వివరించారు. బ్యాంక్ సీఈఓ పి.వెంకటప్రసాద్ మాట్లాడుతూ బ్యాంక్ విశిష్టత, సేవలను, సర్వీసుల గురించి ఖాతాదారులకు వివరించారు. బ్యాంకు చీఫ్ మేనేజర్ పి.వి.శర్మ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

కుల గణన జాబితాలో సవరణకు నేటితో ఆఖరు

నెహ్రూనగర్: ఎస్సీ కుల గణన జాబితాలో సవరణలకు మంగళవారం ఆఖరి రోజు అని గుంటూరు నగరపాలక కమిషనర్ పులి శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో పూర్తయిన కుల గణన జాబితాలను ఈ నెల 26న నగరంలోని 206 వార్డ్ సచివాలయాల నోటీసు బోర్డుల్లో ప్రకటించామని తెలిపారు. నగర ప్రజలు సర్వే రిపోర్ట్‌లోని తమ వివరాలు సరిగా ఉన్నాయో, లేదో చెక్ చేసుకోవచ్చని చెప్పారు. పేర్లు, సబ్ కేటగిరి వివరాలు తప్పుగా ఉన్నా, ఏమైనా అభ్యంతరాలు ఉన్నా మంగళవారం సాయంత్రం 5 గంటల లోపు స్థానిక సచివాలయంలో అడ్మిన్ కార్యదర్శి, వీఆర్‌ఓలకు లిఖిత పూర్వకంగా అర్జీలు అందించవచ్చని తెలిపారు. అర్జీలను క్షేత్ర స్థాయిలో విచారించి, విచారణ మేరకు తుది జాబితాలో నమోదు చేస్తామని పేర్కొన్నారు.

అంబేడ్కర్‌ను అగౌరవపర్చిన అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

సీపీఐ నాయకుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు డిమాండ్


లాడ్జిసెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న వామపక్షాలు

లక్ష్మీపురం: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ని పార్లమెంట్ సాక్షిగా అగౌరవపర్చిన కేంద్ర హోంమంత్రి అమిత్ షాను తక్షణమే కేంద్ర మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. భారత రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై రాజ్యసభలో అవమానకరమైన, అప్రతిష్టకరమైన వ్యాఖ్యలు చేసిన అమిత్ షా వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో సోమవారం లాడ్జిసెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. కార్యక్రమానికి సీపీఎం నగర కార్యదర్శి కె.నళిని కాంత్ అధ్యక్షత వహించారు. ముప్పాళ్ల మాట్లాడుతూ కేంద్రంలో మోదీ, అమిత్‌షా ద్వయం పాచికలు ఆడుతున్నారని విమర్శించారు. వారికి పార్లమెంటరీ ప్రజా స్వామ్యం అంటే ఇష్టం లేదని, అధక్ష తరహా రాజ్యాంగం కావాలని వారు కోరుకుంటున్నారని మండిపడ్డారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ, సీపీఐ ఎంఎల్ నాయకులు విష్ణు మాట్లాడుతూ బీజేపీ ఆర్ఎస్ఎస్‌లకు భారత రాజ్యాంగంపై భిన్నమైన వైఖరి ఉండేదని, వారు రాజ్యాంగాన్ని ఆమోదించలేదని గుర్తు చేశారు. అంబేడ్కర్‌ను అవమానపరిచిన అమిత్‌షా తక్షణమే రాజీనామ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి కోటా మాల్యాద్రి వెంకటేశ్వరరావు, సీపీఐఎంఎల్ జిల్లా నాయకులు ఉల్లిగడ్డ నాగేశ్వరరావు నరసింహారావు, పి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

మనసు ఫౌండేషన్‌తో జేకేసీ కళాశాల ఒప్పందం


అవగాహన ఒప్పందం కుదుర్చుకున్న కళాశాల కరస్పాండెంట్ జాగర్లమూడి తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: బెంగళూరుకు చెందిన మనసు ఫౌండేషన్‌తో జేకేసీ కళాశాల అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.గోపీచంద్ సోమవారం తెలిపారు.

కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ జాగర్లమూడి మురళీమోహన్ మాట్లాడుతూ ఈ ఒప్పందం ద్వారా 80 వేలకు పైగా అరుదైన, విలువైన తెలుగు పుస్తకాలు పీడీఎఫ్ ఫార్మాట్‌లో కళాశాల విద్యార్థులకు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. అరుదైన పుస్తకాలు ఉన్న జేకేసీ కళాశాల గ్రంథాలయానికి నూతన ఒప్పందం ద్వారా మరింత బలం చేకూరుతుందని, అంతరించిపోతున్న మాతృభాష తెలుగుకు ఆదరణ పెరుగుతుందని అన్నారు. మనసు ఫౌండేషన్ చైర్మన్ మన్నం వెంకటరాయుడు మాట్లాడుతూ తెలుగుభాషలో విలువైన పుస్తకాలను వివిధ సంస్థల నుంచి, వ్యక్తుల నుంచి సేకరించి వాటిని డిజిటలైజేషన్ చేసి పీడీఎఫ్ ఫార్మాట్‌లో సంస్థలకు, సమాజానికి అందించాలనే గొప్ప సంకల్పంతో మనసు ఫౌండేషన్ పని చేస్తోందని చెప్పారు. నూతనమైన ఈ ప్రక్రియ ద్వారా భవిష్యత్తు తరాల వారికి, పరిశోధకులకు ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. తద్వారా తెలుగు భాష ఔన్నత్యం ప్రజలందరికీ తెలుస్తుందని అన్నారు. విలువైన పుస్తకాలను పీడీఎఫ్ రూపంలో జేకేసీ కళాశాలకు అందించేందుకు ముందుకు వచ్చిన మనసు ఫౌండేషన్ ప్రతినిధులకు కళాశాల పీజీ కోర్సుల డైరెక్టర్ ఎస్ఆర్కే ప్రసాద్, ప్రిన్సిపాల్ పి.గోపీచంద్ కృతజ్ఞతల తెలిపారు. కార్యక్రమంలో కళాశాల గ్రంథాలయాధికారి చెరుకూరి నాగభవానీ, పారా అశోక్ పాల్గొన్నారు.

డేటా చౌర్యం కేసులో నిందితుడికి స్టేషన్ బెయిల్

- నిందితుడి కోసం 20 రోజులుగా గాలింపు
- హైదరాబాద్ అరెస్ట్ చేసి గుంటూరుకు తరలింపు
- ఎలాంటి సంబంధం లేని సిబ్బందిపై సస్పెన్షన్ వేటు

లక్ష్మీపురం: ఏకంగా పోలీస్ స్టేషన్‌లోనే డేటా చౌర్యం చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేసి సంచలనం రేపిన కేసులో ఏ-1 నిందితుడుగా ఉన్న విలేకరి అరుణ్‌కు సోమవారం అధికారులు స్టేషన్ బెయిల్ ఇచ్చారు. వివరాలు.. గుంటూరు వెస్ట్ సబ్ డివిజన్ పరిధిలోని అరండల్‌పేట పోలీస్ స్టేషన్ లోనే సీసీ ఫుటేజ్ డేటాను చౌర్యంపై వివాదం నెలకొంది. ఈనేపథ్యంలో పలువురు పోలీస్ అధికారులపై చర్యలు తీసుకున్నారు. టెక్నీషియన్ శేషును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్‌హెచ్‌ఓ శ్రీనివాసరావు వీఆర్‌కు పిలిచారు. ఇదే వ్యవహారంలో ఈ కేసులో టి.వి.5 కెమెరామెన్ వంశీ కోసం అధికార పార్టీ నాయకులు స్వయంగా స్టేషన్ వద్దకు వచ్చి వంశీకి స్టేషన్ బెయిల్ ఇప్పించి మరి తీసుకెళ్లారు. అప్పటి నుంచి ఈ కేసులో మరో నిందితుడు అరుణ్ పరారీలో ఉన్నాడు. ఈ వ్యవహారం అంతా రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా నాయకుడు బోరుగడ్డ అనిల్‌ను కస్టడీలో తీసుకుని పోలీస్ స్టేషన్‌లో మర్యాదలు చేసిన వ్యవహారం అంతా సీసీ పుటేజ్‌లో రికార్డు అయిన డేటాను సోషల్ మీడియాలో పోస్ట్ చేసినందుకే ఇదంతా జరిగింది. ఇదిలా ఉంటే ఈ కేసులో నిత్యం అరుణ్ అనే విలేకరితో నల్లపాడు ఎస్ఐ నాగరాజు తరుచుగా ఫోన్‌లో మాట్లాడుతుంటారని పోలీస్ ఉన్నతాధికారులు వీఆర్‌కు పిలిచారు. ఇంత వ్యవహారం నడిచిన కేసులో అరుణ్ అనే విలేకరి కోసం పోలీస్ ఉన్నతాధికారులు 6 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలించారు. గత 20 రోజులుగా పోలీసులు స్టేషన్‌లో పనులు వదులు కోని మరి గాలించి తీరా ఆదివారం హైదరాబాద్‌లో అరుణ్‌ను అదుపులో తీసుకుని గుంటూరుకు తీసుకొచ్చారు. స్టేషన్ బెయిల్ ఇచ్చారు. దీనికి అధికార పార్టీ ఆదేశాలు ఉన్నట్లు సమాచారం.

తిరుప్పావై 20వ పాశురంపై ప్రవచనం

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం పద్మావతి కళ్యాణ వేదికపై సోమవారం సాయంత్రం తిరుప్పావై ఇరవైవ పాశురంపై ప్రవచనం నిర్వహించారు. ఆలయ కమిటీ సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. తిరుప్పావై అమృత వ ర్షిణి డాక్టర్ కోగంటి వెంకటశ్రీరంగనాయకి ప్రసంగించారు.

సవాళ్లను ఎదుర్కొని లక్ష్యాన్ని చేరుకోవాలి

ప్రొఫెసర్ జి.ఉమామహేశ్వరరావు


జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రొఫెసర్ జి.ఉమామహేశ్వరరావు

ఏఎన్‌యూ: విద్యార్థి దశలో అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవడం కోసం ఎన్ని సవాళ్లు ఎదుర్కొన్నా లక్ష్యసాధన మరువకూడదని హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయ లింగ్విస్టిక్ ప్రొఫెసర్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు ప్రొఫెసర్ జి.ఉమామహేశ్వరరావు అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో సోమవారం ఆర్ట్స్ కామర్స్ అండ్ లా, సైన్స్, ఫార్మసీ, వ్యాయామ విద్య, ఆర్కిటెక్చర్ అండ్ ప్లానింగ్ కళాశాలలు సంయుక్తంగా ఇండక్షన్ అండ్ ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ఆంగ్ల మాధ్యమంలో ఉన్న పుస్తకాలను మాతృభాషలో అనువాదం చేయించి విద్యార్థులకు అందుబాటులో ఉంచాల్సిన అవసరం ఉందన్నారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో అత్యధిక సంఖ్యలో ఆవిష్కరణ చేస్తున్న దేశాలన్నీ కూడా విద్యాబోధనను వారి మాతృభాషలోనే బోధిస్తున్నాయని గుర్తు చేశారు. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయ మేనేజ్మెంట్ డీన్ ప్రొఫెసర్ బెల్లంకొండ రాజశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు తమ లక్ష్యాలను గుర్తు ఎరగాలని తద్వారా వాటి సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. వీసీ ఆచార్య కే గంగాధర రావు మాట్లాడుతూ వర్సిటీ క్యాంపస్‌లో ఉన్న వసతుల్ని విద్యార్థుల సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఆర్ట్స్, కామర్స్, లా కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.సురేష్ కుమార్, రెక్టార్ కె.రత్న షీలా మణి, రిజిస్ట్రార్ జి.సింహాచలం, వర్సిటీ కళాశాలల ప్రిన్సిపాల్స్ కె.వీరయ్య, పి.జాన్సన్, ఎ.ప్రమీలరాణి, ఇన్‌చార్జి ఓఎస్డీ ఆచార్య ఆర్‌వీఎస్ఎస్ఎన్ రవికుమార్ శుభాకాంక్షలు తెలిపారు.

అడ్డగోలుగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ల బదిలీలు

- 22 నుంచి 32 శానిటరీ డివిజన్లకు పెంపు
- సీనియార్టీ లిస్ట్ ప్రకారం కౌన్సెలింగ్ లేకుండానే బదిలీలు
- బదిలీలపై కొంత మంది సీనియర్ శానిటరీ ఇన్‌స్పెక్టర్లు కూడా అసంతృప్తి
- మలేరియా ఇన్‌స్పెక్టర్‌కి కూడా అదనంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్


ప్రజారోగ్య విభాగం

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ ప్రజారోగ్య విభాగంలో పనిచేసే శానిటరీ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ నగర కమిషనర్ పులి శ్రీనివాసులు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఉన్న 22 శానిటరీ డివిజన్లను 32 శానిటరీ డివిజన్లకు పెంపుదల చేసి బదిలీలు చేపట్టడంపై అసంతృప్తి వ్యక్తమవుతోంది. మలేరియా ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసే ఒకరికి శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా అదనపు బాధ్యతలు కట్టబెట్టారు.

సీనియర్ శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పెదవి విరుపు

డివిజన్ల పెంపుతో పాటు బదిలీలపై కొంత మంది సీనియర్ శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పెదవి విరుస్తున్నారు. తమ అనుకునే వారికి, నెల మామూళ్లు ఇచ్చే వారికి ప్రైమ్ వార్డు కేటాయించి, తమ మాట వినని వారిని తక్కువ ప్రాధాన్యం కలిగిన వార్డులు కేటాయించారంటూ సీనియర్ ఇన్‌స్పెక్టర్లు ప్రజారోగ్యధికారుల తీరుపై బహిరంగంగానే మండిపడుతున్నారు. ఇందులో కొంత మంది మేస్త్రీలకు కూడా ప్రైమ్ వార్డులు కేటాయించడంపై మరింత గుర్రుగా ఉన్నట్లు సమాచారం.

కౌన్సెలింగ్ నిర్వహించకుండానే..

ప్రజారోగ్య విభాగంలో పనిచేసే శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, హెల్త్ అసిస్టెంట్, మేస్త్రీలకు సీనియార్టీ ప్రకారం కౌన్సెలింగ్ నిర్వహించకుండానే బదిలీలు చేపట్టడంపై పలువురు ఇన్‌స్పెక్టర్లు గుర్రుగా ఉన్నారు. గతంలో కమిషనర్‌గా పనిచేసిన చల్లా అనురాధ సీనియార్టీ ప్రకారం కౌన్సెలింగ్ బదిలీలు చేపట్టారు. కాని ఈ సారి సీనియార్టీ ప్రకారం కౌన్సెలింగ్ నిర్వహించకుండానే ప్రజారోగ్యధికారులు మామూళ్లు తీసుకుని బదిలీలు చేశారని పలువురు ఆరోపిస్తున్నారు.

భారీగా ముడుపులు ఆరోపణలు?

బదిలీల్లో ముడుపులు ఇచ్చిన వారికి ప్రైమ్ వార్డుల కేటాయింపు జరిగిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వీరిలో కొంత మంది మేస్త్రీలకు కూడా ప్రైమ్ వార్డులు కేటాయించారు. మలేరియా ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసే వ్యక్తిగా అదనంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ కేటాయించారు. సదరు ఉద్యోగి మలేరియా విధులు నిర్వహించాలా, లేక శానిటేషన్ విధులు చూసుకోవాలా రెండు విధులు ఏ విధంగా నిర్వహిస్తారని కొంత మంది సిబ్బంది ప్రశ్నిస్తున్నారు.

వార్డు సచివాలయ ఉద్యోగులు అసంతృప్తి..

ఉన్నత విద్యార్హతలు కలిగిన తమను కాదని ఎటువంటి విద్యార్హతలు లేని వారికి ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్లుగా పోస్టింగ్ ఇవ్వడంపై వార్డు శానిటేషన్, ఎన్విరాన్మెంట్ సెక్రటరీలు అసంతృప్తిగా ఉన్నారు. 2019 నుంచి సెక్రటరీలుగా ఉన్నా మాకెందుకు అవకాశం ఇవ్వలేదంటూ బహిరంగంగానే అధికారులను ప్రశ్నిస్తున్నారు. ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక విభాగంలో పనిచేస్తున్న సెక్రటరీలకు ఇన్‌చార్జి అసిస్టెంట్ ఇంజినీర్లుగా, ఇన్‌చార్జి టౌన్‌ప్లానింగ్ బిల్డింగ్ ఆఫీసర్లుగా నియమించినప్పుడు మమ్మల్ని ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్లుగా ఎందుకు నియమించలేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఉద్యోగాలకు పలువురు ఎంపిక



గుంటూరు ఎడ్యుకేషన్: లక్ష్మీపురంలోని అభ్యుదయ మహిళా డిగ్రీ కళాశాలలో సోమవారం అద్వైత్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో కళాశాలకు చెందిన విద్యార్థినులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ బి.రోహిణీదేవి, డైరెక్టర్ బీఎస్ఆర్కే ప్రసాద్ తెలిపారు. డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్న 70 మంది విద్యార్థినులు ఇంటర్వ్యూలకు హాజరు కాగా, వారిలో మొదటి దశలో 50 మంది ఎంపికయ్యారని వివరించారు. అదే విధంగా రెండో దశలో 39 మంది ఎంపికైనట్లు వివరించారు. ఈసందర్భంగా ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థినులను అభినందించారు. కార్యక్రమంలో అద్వైత్ అకడమిక్ డైరెక్ట్ ఎం.అంజయ్, హెచ్ఆర్ పి.జగదీష్ పాల్గొన్నారు.

భీమ్ సేన జిల్లా అధ్యక్షుడిగా రత్తయ్య



నెహ్రూనగర్: భీమ్ సేన జిల్లా అధ్యక్షుడిగా సుదర్శనం రత్తయ్య నియమితులయ్యారు. సంఘ కార్యవర్గ ఎన్నిక లాడ్జిసెంటర్‌లోని భీమ్ సేన కార్యాలయంలో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు నేలపాటి నాగభూషణం అధ్యక్షతన నిర్వహించారు. సంఘ గౌరవధ్యక్షులుగా డాక్టర్ సీహెచ్ ప్రసాదరావు, జిల్లా ఉపాధ్యక్షులుగా పి.ప్రభుదాస్, ట్రెజరర్‌గా జీ రవీంద్రనాథ్‌బాబు, ప్రధాన కార్యదర్శిగా ఎం.పార్థసారధి, కార్యదర్శి కె.లక్ష్మీనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా ఎం.రాజారావు, ఎన్.కృష్ణమూర్తి, జాయింట్ సెక్రటరీలుగా కె.అంకమ్మరావు, వి.అంకమ్మరావు, సలహాదారులుగా వై.ముత్తయ్య, సాంబశివరావులను ఎన్నుకున్నారు.

పన్ను బకాయిలపై దృష్టి సారించాలి

కమిషనర్ పులి శ్రీనివాసులు



నెహ్రూ నగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ఆస్తి, ఖాళీ స్థల, నీటి కుళాయి, మీటర్ల బకాయిల వసూలుకు చర్యలు వేగవంతం చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. కమిషనర్ చాంబర్‌లో అదనపు కమిషనర్, డెప్యూటీ కమిషనర్, రెవెన్యూ అధికారులు, ఇన్‌స్పెక్టర్లు ఆస్తి, ఖాళీ స్థల పన్ను, నీటి మీటర్ల చార్జీల వసూలు వేగవంతంపై సమీక్ష సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ రెవెన్యూ ఇన్స్పెక్టర్ల వారీగా పన్నుల వసూలుపై సమీక్షించి, వసూలు లక్ష్యానికి తగిన విధంగా లేవని, రాబోవు రెండు రోజుల్లో వార్డు సచివాలయాల వారీగా అడ్మిన్ కార్యదర్శులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు పన్ను వసూలుకు ప్రత్యేక యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలన్నారు. పన్ను వసూళ్లలో నిర్లక్ష్యం, సరికాదని, మార్చి నాటికి నూరు శాతం పన్ను వసూలు జరగాలని, పురోగతి లేకుంటే చర్యలు తప్పవన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డెప్యూటీ కమిషనర్ టి.వెంకట కృష్ణయ్య, రెవెన్యూ అధికారులు బాలాజీ బాషా, రెహ్మాన్, సాదిక్ భాష, రవి కిరణ్ రెడ్డి పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం చోరీ

లక్ష్మీపురం: బైక్ చోరీపై బాధితుడు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పట్టాభిపురం పోలీసులు తెలిపిన వివరాలు.. అశోక్‌నగర్ ప్రాంతానికి చెందిన కటికం సత్యనారాయణ డిజిటల్ మార్కెంటింగ్ చేస్తు జీవనం సాగిస్తుంటాడు. ఈనెల 22వ తేదీన మధ్యాహ్నాం 12 గంటల సమయంలో ఇంటి ముందు రాయల్ ఎన్‌ఫీల్డ్ వాహనం పార్కింగ్ చేసి తిరిగి సాయంత్రం బయటకు వచ్చి చూసే సరికి వాహనం కనిపించలేదు. దీంతో చుట్టు పక్కల ప్రాంతాలలో పరిశీలించగా ఎంతకు కనిపించలేదు. సీసీ కెమెరాల ఫుటేజ్‌లో పరిశీలించగా ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు వాహనం చోరీ చేసినట్లు గుర్తించారు. దీంతో బాధితుడు పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు ఎస్టీయూ కృషి

పెదకాకాని: విద్యార్థుల ఉజ్వల ఉన్నతికి ఎస్టీయూ కృషి అభినందనీయమని ఎంపీడీఓ రమావత్ శ్రీనివాసరావు అన్నారు. పెదకాకాని మండలంలోని వెనిగండ్ల జెడ్పీహెచ్ స్కూల్‌లో సోమవారం (2024–25) పదో తరగతి విద్యార్థులకు ఉపయోగపడేందుకు రూపొందించిన 152 పేజీల ముఖ్యమైన విషయ పరిజ్ఞానపు పుస్తకాన్ని విద్యార్థులకు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎంపీడీఓ ఆర్.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎస్టీయు ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులు అందజేస్తున్న ముఖ్య విజయ పరిజ్ఞాన పుస్తకం ఉత్తమ ఫలితాలు సాధించేందుకు దోహదపడుతుందన్నారు. మండల విద్యాశాఖాధికారి వి.శంకరరావు పదవ తరగతి విద్యార్థులకు ఉచితంగా ముఖ్య విషయ పరిజ్ఞాన పుస్తకాన్ని రూపొందించి పంపిణీ చేస్తున్న ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘాన్ని అభినందించారు. అలానే పుస్తకాల ముద్రణకు ఆర్థిక సహకారం అందించిన ఉపాధ్యాయినీలు వి జ్యోతి, జి అనిత, బి పెర్సిరాజశ్రీలను అధికారులు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం మండల అధ్యక్షులు ఎం.జోసఫ్, గౌరవాధ్యక్షులు ఎం దేవపాల్, జిల్లా కౌన్సిలర్ పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.